www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 నవంబర్ 2022
5
అన్నమయ్య

బురుజుపల్లి అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని బురుజుపల్లి అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సిడిపిఒ పద్మావతి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గుండ్ల చెరువు పంచాయతీలోని బురుజుపల్లి, వడ్డేపల్లి అంగన్వాడీ సెంటర్‌కు పక్కా భవనం మంజూరైందన్నారు. రూ.16.50 లక్షల నిధులు కూడా మంజూరు అయ్యాయని తెలిపారు. సర్వే చేసి ఇస్తే అక్కడ పక్క భవన నిర్మించుకోవడానికి అనుకూడా ఉంటుందని ఆమె డిటి తిమ్మారెడ్డిని కోరారు. సర్వే చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్కడ పక్కా భవనం నిర్మించుకోవడానికి వీలవుతుందన్నారు. బుజుపల్లి గ్రామ ప్రజలు అంగన్వాడీ టీచర్ వచ్చి సిడిపిఒ సమస్యను వివరించగా తహశీల్దార్ ద్వారా సమస్యను పరిష్కరించడానికి కృషి సేవ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ అంగన్వాడి టీచర్లు పలువురు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి : కలెక్టర్

బహిరంగ సభ ఏర్పాట్ల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మదనపల్లె పర్యటన ఏర్పాట్లు పక్కాగా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి బిటి కళాశాలలో హెలిపాడ్ నిర్మాణ పనులు, టిప్పుసుల్తాన్ గ్రౌండ్‌లోబహిరంగ సభ ఏర్పాట్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25న సిఎం జగనన్న విద్యా దీవెన నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. పర్యటనలో ఎటువంటి చిన్న పొరపాటు జరగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అధికారులకు కేటాయించిన విధులు ప్రత్యేక శ్రద్ధతో జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. 24వ తేదీ ఉదయానికల్లా అన్ని పనులు పూర్తి కావాలన్నారు. బిటి కాలేజీ నుంచి టిప్పు సుల్తాన్ గ్రౌండ్ వరకు ముఖ్యమంత్రి నిర్వహించే రోడ్ షోకి సంబంధించి రోడ్డుకు ఇరువైపులా బారికేడింగ్ పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ నుండి సిఎం వెళ్లే రహదారి పొడవునా ప్రతి వంద మీటర్లకు ఒక వాలంటీర్‌ను నియమించి ప్రజలు ఎటువంటి తోపులాటకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో ముఖ్యమంత్రికి అర్జీలు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సిఎం పర్యటనకు 50 వేల మంది పైగా ప్రజలు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేసి సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన జర్మన్ హాంగర్ టెంట్‌లో మొత్తం చైర్స్ వేసి ప్రెస్ గ్యాలరీ, సౌండ్ సిస్టం గ్యాలరీ, విఐపి గ్యాలరీ, పబ్లిక్ గ్యాలరీ విద్యార్థిని విద్యార్థులు కూర్చునే విధంగా బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సౌండ్ సిస్టం, ఎల్ఈడి స్క్రీన్లు జాగ్రత్తగా అమర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మనుజారెడ్డి, ఆర్డీవో మురళి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఆర్అండ్‌బి ఇఇ అరవిందదేవి, డిపిఒ నాగరాజ, తహశీల్దార్ శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షోభంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ

- వ్యవసాయ పనులు లేక వలసలు
- ఉపాధి హామీని బలహీన పరుస్తున్న కేంద్రం
- శ్రామికుల జీవన గమనంపై సర్వే
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్

ప్రజాశక్తి- కడప అర్బన్

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి నెట్టవేయబడిందని, వ్యవసాయ పనులు దొరకడం లేదని, ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీన పరుస్తూ ఉందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్ పేర్కొన్నారు. సోమవారం యుటిఎఫ్ భవన్‌లో గ్రామీణ వ్యవసాయేతర కార్మికుల సర్వేపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసేందుకు యంత్రాలకు అనుమతి ఇవ్వడం దారుణమని వాపోయారు. రాయలసీమ జిల్లాలలో పనులు లేక లక్షలాది మంది శ్రమజీవులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. సిఐటియుగా గ్రామీణ ప్రాంతంలో పేదల జీవితాలు ఎలా ఉన్నాయి, శ్రామికులకు పనులు ఎన్ని రోజులు దొరుకుతున్నాయి, పిల్లల చదువులు, వైద్యం, కుటుంబ ఖర్చులు అప్పులు ఎలా ఉన్నాయి అనే వాటిపై సర్వే చేస్తున్నామని తెలిపారు. ఎనిమిది జిల్లాల వారికి వర్క్ షాప్ నిర్వహించామని చెప్పారు. డిసెంబర్ 20 లోపు ఎంపిక చేసిన జిల్లాలోని మండలాల్లో పది గ్రామాలకు తక్కువ కాకుండా సర్వే చేయనున్నారని పేర్కొన్నారు. రాయలసీమలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంది అనే విషయం తెలుస్తుందని చెప్పారు. సర్వేలోని అంశాలను ప్రభుత్వం ముందు పెడతామని తెలిపారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఎనిమిది జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్

డాక్టర్లను సన్మానిస్తున్న జెసి తమీమ్ అన్సారీయా

ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు భేష్ : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య విధాన సేవలు బాగా అమలు చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా వైద్యాధికారులను, డాక్టర్లను అభినందించారు. సోమవారం జెసి ఛాంబర్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం బాగా అమలు అవుతూ ఉండడంతో ఐదుగురు డాక్టర్లకు కలెక్టర్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు చాలా బాగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఇంకా బాగా అమలు చేస్తున్నారని, ఇదే విధంగా కొనసాగించాలని డాక్టర్లను ఆదేశించారు. అనంతరం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని బాగా అమలు చేస్తున్నందున వైద్యులకు సన్మానం చేశారు. డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి డాక్టర్ సృజన (నందలూరు), డాక్టర్ సతీష్ కుమార్ (రేగల్లు), డాక్టర్ శ్రీధర్ (కురబలకోట), డాక్టర్ పి.జవహర్ బాబు (ఎర్రకోటపల్లి)లకు సన్మానించారు. కార్యక్రమంలో డిఎమ్‌హెచ్ఒ డాక్టర్ కొండయ్య, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ రియాజ్ బేగ్, డాక్టర్ విష్ణు, 104 జిల్లా కో-ఆర్డినేటర్ ప్రవీణ్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కలెక్టర్ గిరీష జారీ చేసిన వాలంటరీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వార్డు వాలంటీర్ అభ్యర్థులకు సోమవారం మున్సిప్ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 24 మందిలో 22 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అధికారులు వారి ధ్రువపత్రాలు పరిశీలన చేశారు. ఎంపికైన వారికి త్వరలో నియామక పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు.

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కమిషనర్

సోలార్ పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బంది ధర్నా

తూముకుంట సోలార్ పరిశ్రమ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని ఎన్‌పి.కుంట, తూముకుంట పరిధిలోని సోలార్ పరిశ్రమలోని పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ సెక్యూరిటీ ఏజెన్సీ వారు సోలార్ కంపెనీల నుంచి జీతాలు ఎక్కువ తీసుకుంటూ తమకు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోలార్ కంపెనీలు రూ.17 వేలు జీతం ఇస్తుంటే ఏజెన్సీ వారు రూ.10,946 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. మిగిలిన సొమ్మును వారే కాజేస్తున్నారని విమర్శించారు. కష్టపడి పనిచేసేది సెక్యూరిటీ సిబ్బంది అయితే జీతాలు మధ్యలో వాళ్ళు నొక్కేస్తున్నారన్నారు. నెలనెలా జీతాలు ఇవ్వక ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. 12 శాతం పిఎఫ్, ఈఎస్ఐ కింద రూ.1600 కట్ అవుతోందన్నారు. రూ.1300 తీసుకోవాల్సి ఉందని, అధికంగా తీసుకుంటున్నారని వాపోయారు. జీతాలు పెంచాలని 2022 సంవత్సరంలో పోరాడితే రూ.1300 పెంచారని, 2021లో రూ.370 పెంచారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

జోడో యాత్రతో కాంగ్రెస్ బలోపేతం : పిసిసి

తులసిరెడ్డిని సన్మానిస్తున్న మోహియుద్దీన్

కలికిరి : రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రతో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమైందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి తెలి పారు. సోమవారం ఆయన కుటుంబ సమేతంగా గడిలోని పిసిసి సెక్రెటరీ కేఎస్ ఆఫా మోహియుద్దీన్ ఇంటికి విచ్చేశారు. తులసిరెడ్డిని ఆఫా మోహియుద్దీన్ శాలువా కప్పి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి కుటుంబ సభ్యులకు ఆఫా తేనీటిని ఏర్పాటు చేసారు. అనంతరం రాష్ట్రంలో రాహుల్ జోడో యాత్ర ప్రభంజనం గూర్చి చర్చించారు. కేంద్రంలో బిజెపి ఆగడాలను ప్రజలు అరికట్టే సమయం వచ్చిందన్నారు. నేడు బిజెపి ఆగడాలు భరించలేని ప్రజలు రాహుల్ గాంధీ జోడోయాత్రకు బ్రహ్మరథం పడుతున్నట్లు తెలిపారు. జోడోయాత్రలో అడుగడుగున ప్రజల భాధలను రాహుల్ గాంధీ వింటున్నారని, చూస్తున్నారని ఆఫాకు డాక్టర్ తులసి రెడ్డి తెలిపారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టనున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జకీ పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న డిఆర్ఓ సత్యనారాయణ

అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించండి : డిఆర్ఓ

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను డిఆర్ఓ సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీల తిరస్కారం జీరో కావాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి ఏ ఒక్క అర్జీ పోకూడదన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా స్పందన పై సమీక్షలు నిర్వహిస్తున్నారని, అధికారులు అందరూ కూడా బాధ్యతతో సీరియస్‌గా తీసుకొని స్పందన సమస్యలను పరిష్కరించాలన్నారు. గడువు దాటి ఒక్క సమస్య కూడా ఉండకూడదన్నారు. పరిష్కారం గురించి అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలతో ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. బాధితులు అడిగిన సమస్యకు అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న సిడిపిఒ రాజమ్మ

అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు

అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణానికి సిడిపిఒ రాజమ్మ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. సోమవారం సిడిపిఒ ముందుగా కె.వి పల్లి మండలంలోని గుండ్రేవారిపల్లి, జాండ్రపేట, ఎంవి పల్లి, ఊరమాదిగపల్లి అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందరేగా గర్భవతులు బాలింతలకు వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఊరమాదిగపల్లి అంగన్వాడీ కేంద్రానికి నూతన భవనం మంజూరు కావడంతో భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సిడిపిఒ వెంట సూపర్వైజర్ పి.స్వర్ణ, మండల రెవెన్యూ సర్వేయర్ హరి, ఎంవి పల్లి విఆర్ఓ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'సిఎంను కలిసేందుకు ఎంపీ సహకరించాలి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ సైనికులకు రాజంపేట పార్లమెంటు సభ్యులు ఇచ్చిన హామీ నేరవేర్చలేదని, మాగోడు చెప్పుకోవడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని సైనిక సంఘం మాజీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 8/1లో చేపట్టే అక్రమ నిర్మాణాలకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు సహకరించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. సైనికులకు కేటాయించిన స్థలంపై కోర్టు కేసులు నడుస్తున్నాయని, ప్రస్తుతం నిర్మాణాలు చేపట్టే వారు కోర్టు ఉత్తర్వులు పాటించడం లేదన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన తహశీల్దారు కుప్పుస్వామి కేసు సిఐడికి అప్పగించాలని కోరగా, ప్రస్తుత తహసీల్దారు శ్రీనివాసులు గతంలో పని చేసిన అధికారులు తప్పిదాలను ఎత్తి చూపిస్తూ కోర్టుకు నివేదిక ఇచ్చారని వివరించారు. అనుమతులు లేకుండా మూడు అంతస్తుల భవన నిర్మాణానికి మున్సిపల్ అధికారులు సహకరించడం, ట్యాప్ కనెక్షన్ల ఇవ్వడం, పార్టీ కార్యాలయం ఏర్పాటు జరిగిందని ఇందుకు అధికారులు సహకరిస్తున్నారని తెలిపారు. పేదవాడు చిన్న ఇళ్లు కట్టుకుంటే నిభందనల పేరిట వేదించే అధికారులు అక్రమ నిర్మాణం పట్టించుకోలేదన్నారు. గత ఎన్నికల సమయంలో ఎంపి మిథున్ రెడ్డి మదనపల్లె బహిరంగ సభలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడు నెలలలో మాజీ సైనికులకు న్యాయం చేస్తామని ప్రకటించిన నేటికి హామి నేరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సైనికులకు సిఎం అపాయింట్మెంట్ ఇవ్వాలని కోరారు. మాజీ సైనికుల సమస్యలు చెప్పుకోవడానికి సమయం కేటాయించాలని కోరారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సైనిక భవన్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని, నిర్మించడానికి త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటిం చారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ యూసుఫ్, సెక్రెటరీ రాయుడు, ట్రెజరర్ ప్రతాప్‌రెడ్డి, సభ్యులు ఎం.వి.రెడ్డి, వెంకటస్వామి, మూర్తి, భాస్కర్, సహదేవ రెడ్డి, పద్మావతి, రామలక్ష్మి, రెడ్డి సునీత, వెంకటరమణ, దీపక్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సైనికులు

విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు రూరల్

మండలంలోని సమతా నగర్‌లో విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సి.హెచ్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన సమతానగర్‌లో పర్యటించి మాట్లాడుతూ స్తంభాలు కూలిపోవడం, ఒరిగిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పూర్తిగా ఉందన్నారు. ఈ కాలనీలో ఎక్కువ భాగం గిరిజనులు, దళితులు నిర్వహిస్తున్నారని, అందుకే అధికారులు పట్టించుకోలేదన్నారు. విద్యుత్ స్తంభం ఒరిగిపోయి, వర్షాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఏం జరిగినా విద్యుత్ అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు.

వైస్ చైర్మన్‌నే ఎన్నుకోవాలని జెసికి వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వైదొలగినప్పుడు వైస్ చైర్మన్‌నే చైర్మన్ పదవికి ఎన్నుకోవాలని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు తెలియజేశారు. ఇటీవల మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ నాగాంజనేయరెడ్డి జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లడంతో ఖాళీగా ఉన్న చైర్మన్ స్థానానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో వేరొక మహిళను చైర్మన్ స్థానానికి ఎన్నుకోవడంతో మొదలైన వివాదం సోమవారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. వైస్ చైర్మన్‌గా ఉన్న మందా శివపార్వతిని కాదని వేరొకరిని నియమించడం పట్ల దళితులకు అన్యాయం చేశారంటూ జాయింట్ కలెక్టర్ తమీమబీ అన్సారీయాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మందా శ్రీనివాసులు మాట్లాడుతూ దళితులన్న కారణంగానే వివక్షతో చైర్మన్ స్థానాన్ని కేటాయించలేదని ఆరోపించారు. దళితుల మనోభావాలను కించపరిచేలా జరిగిన ఎన్నికను రద్దు చేసి వైస్ చైర్మన్‌గా ఉన్న దళిత మహిళనే చైర్మన్‌గా నియమించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు జ్యోతి శివ, జడ శివ, జ్యోతి పాల్గొన్నారు.

జెసికి వినతి పత్రం సమర్పిస్తున్న దళిత నాయకులు

డిఇఒపై చర్య తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ, ఐఎఫ్ఎస్

జెసికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ, ఐఎఫ్ఎస్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు తొత్తుగా మారిన డిఇఒ రాఘవరెడ్డిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలిని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు ఎస్ఎఫ్ఐ, ఐఎఫ్ఎస్ నాయకులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయి కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజు నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు పలుమార్లు డిఇఒ దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ ఎటువంటి స్పందన లేదున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు శని,ఆదివారాల్లో తరగతులు నిర్వహించకూడదని, నిబంధనల మేరకు స్కూల్ టైమింగ్స్ ఏ ప్రైవేట్ స్కూల్ ళ్లు యాజమాన్యాలు అమలు చేయడం లేదున్నారు. దీనిపైన అనేకమార్లు డిఇఒ, స్థానిక ఎంఇఒలకు ఆర్జేడి వెంకట కృష్ణారెడ్డికి చెప్పినప్పటికీ ఎటువంటి స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్న డిఇఒ ఇప్పటికైన శాఖ పరమైన చర్యలు తీసుకొనీ ప్రభుత్వ నిబంధనలను అమలు జరిగే విధంగా చూడాలని కోరారు. డిఇఒ సర్వ శిక్ష అభియాన్ ఏపీసి, డైట్ కళాశాల ప్రిన్సిపల్ వంటి ప్రధాన బాధ్యతలని డిఇఒకు ఇవ్వడం ద్వారా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వెంటనే ఆయనను ఎపిసి బాధ్యతల నుండి తప్పించి ఇతరులకు కేటాయించాలని, డైట్ కళాశాల ప్రిన్సిపల్‌ను వేరే వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మదనపల్లి, రాయచోటి, రాజంపేట, పీలేరు, కోడూరు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా ఫీజులు వసూలు చేయకుండా నోటీసు బోర్డులో కూడా పెట్టకుండా 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని డిఇఒ ప్రగల్భాలు పలుకుతున్నప్పటికి అది ఎక్కడ అమలు కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పక్రుద్దీన్, రాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ముఖ హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి -కలకడ

ప్రతి ఒక్కరికీ ఫేషియల్ హాజరు తప్పక వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిని ఉషశ్రీ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా వైద్యశాలలు సిబ్బంది హాజరును పరిశీలించారు. వ్యాక్సిన్ నిల్వ ఉంచు ఫ్రిడ్జ్ లను పరిశీలించి, ఉష్ణోగ్రతలు నమోదు చేయు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఫుల్లీ ఇమ్మునైజేషన్ లక్ష్యం అధిగమించాలని ఆదేశించారు. పి.హెచ్.సిలో కాన్పులు ప్రోత్సాహించాలని ఆదేశించారు. రానున్న పల్స్ పోలియో కార్యక్రమము నకు సంభందించిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మల్లికార్జున డాక్టర్ మోహన్,పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సిన్ ఫ్రిడ్జ్‌ను పరిశీలిస్తున్న ఉషశ్రీ

రాజంపేట : అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నం పరబ్రహ్మస్వరూపమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం పాత బస్టాండ్ కూడలిలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట వారి ఆధ్వర్యంలో లయన్ నరసింహరాజు సహకారంతో కార్తీక మాసం నాలుగవ సోమవారం సందర్భంగా భక్తులకు, పేదవారికి అన్న ప్రసాదం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలిగొన్నవారికి పట్టెడన్నం పెట్టడంలో ఆత్మ సంతృప్తి ఉంటుందని అన్నారు. కార్తీక మాసంలోని నాలుగు సోమవారాలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేయడం జరిగిందని తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని పెద్దలు ఏనాడో చెప్పారని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడంలో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై.సుబ్రహ్మణ్యం రాజు, కోశాధికారి దండే రవికుమార్, లయన్స్ క్లబ్ నాయకులు పీకేటి నాగేశ్వరావు, మద్యపట్ల రామకృష్ణ నాయుడు, ఏ.వెంకటసుబ్బయ్య నాయుడు, రీజన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణరాజుపేట శివాలయంలో వెయ్యి మంది భక్తులకు కీర్తిశేషులు పల్లె మైరాంరెడ్డి గారి జ్ఞాపకార్థం వారి మనవడు పల్లె తన్వేష్ రచన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె గ్రీష్మంత్ రెడ్డి, పుత్తా శంకర్, ముమ్మడిశెట్టి సుధాకర్, ఎలక్ట్రికల్ కిరణ్, ఫణీద్, వంశీ, సురేష్, కనకయ్య, శివకోటి, బొమ్మి సాయికృష్ణ, పూజారి సర్వేశ్వరాచారి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం

ప్రజాశక్తి-కలకడ

కేదారేశ్వర వ్రతాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని స్థానిక దేవలంపేట వెలసిన శ్రీ కామాక్షి సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో కేదారేశ్వర వ్రతం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. మహిళలు ఉదయం నుండి సాయంత్రం వరకు కఠిన ఉపవాసాలు ఉండి గౌరీమాతను తలచుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చకులు కేదారేశ్వర వ్రతాన్ని గురించి ఉపన్యసించడం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

హెల్త్‌కేర్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బలరామ్‌రెడ్డి

నాణ్యతగా భవన నిర్మాణాలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ప్రభుత్వ భవనాల నిర్మాణాల నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని బి.కొత్తకోటకు చెందిన గుత్తేదారు కంచి బలరాం రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న హెల్త్ కేర్ భవనం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్‌కేర్ భవనం నిర్మాణ పనులు శరవే గంగా జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ప్రభుత్వ భవనాల పనులను తనకు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. సచివాలయం-4 పనులతోపాటు నాపై నమ్మకంతో హెల్త్‌కేర్ భవన నిర్మాణ పనులు కూడా అప్పగించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. నాపై నమ్మకం ఉంచి అదనపు బాధ్యతలు ఇచ్చిన ఎమ్మెల్యే నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిర్ధేశించిన గడువులోగా, నాణ్యత ప్రమాణాలతో భవనాన్ని నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి, వాటి కోసం ప్రత్యేక భవనాలను నిర్మిస్తోందని, రైతుభరోసా కేంద్రాలు, అర్బన్ రూరల్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని కొనియాడారు. ఈ వ్యవస్థల ద్వారా పాలన ప్రజల వద్దకే తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గుత్తేదారు సహాయకులు ఎం.వి.కృష్ణయ్య, జనుము ప్రతాప్ పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి త్రివిక్రమ్ ఇంటర్ డిస్టిక్ డాన్స్ కాంపిటీషన్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రెడ్డెన్న ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థిని అభినందన సభను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు త్రివిక్రమ్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

త్రివిక్రమ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మహారాజరాజశ్రీ రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.NO. 614/2022
O.S.NO. 256/2022

గురిగింజకుంట వెంకటసుబ్బమ్మ, W/o నామునిస్వామి, వయస్సు సం॥ 55, R/o, Door No.5/116-10 డెడ్‌లాక్, మస్యూ స్ట్రీట్, చెన్నముక్కపల్లి గ్రా॥, రాయచోటి మం॥, అన్నమయ్య జిల్లా. ...పిటిషనర్/వాది

Vs

సయ్యద్ చాన్‌బాష, S/o సత్తార్‌సాబ్ Door No.5/265-5, సాయిబాబానగర్, రాజులకాలనీ, చెన్నముక్కపల్లి గ్రా॥, రాయచోటి మం॥, అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్/ప్రతివాది

నోటీసు

పిటిషనరు రెస్పాండెంట్ అయిన మీ పై పరాధీనం చేయకుండా పై కోర్టులో పిటీషను దాఖలు చేసి వున్నారు. పై పిటీషను 1-12-2022వ తేది వాయిదా వున్నది. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టులో పై తేదీన ఉ॥ 10.30 లకు మీరు స్వయముగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరు అయి మనవి చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//
కె. ఈశ్వరయ్య, M.Com., B.L.,
టి.వి.రమణ, B.A., B.L.,
పిటిషనర్ తరపున న్యాయవాదులు, రాయచోటి.

మహారాజరాజశ్రీ రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO. 256/2022

గురిగింజకుంట వెంకటసుబ్బమ్మ, W/o నామునిస్వామి, వయస్సు సం॥ 55, R/o, Door No.5/116-10 డెడ్‌లాక్, మస్యూ స్ట్రీట్, చెన్నముక్కపల్లి గ్రా॥, రాయచోటి మం॥, అన్నమయ్య జిల్లా. ...వాది

Vs

సయ్యద్ చాన్‌బాష, S/o సత్తార్‌సాబ్ Door No.5/265-5, సాయిబాబానగర్, రాజులకాలనీ, చెన్నముక్కపల్లి గ్రా॥, రాయచోటి మం॥, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది

దావా సమను

వాది ప్రతివాది అయిన మీపై Specific Performance పై కోర్టులో దావా దాఖలు చేసి వున్నారు. పై దావా 1-12-2022వ తేది వాయిదా వున్నది. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టులో పై తేదీన ఉ॥ 10.30 లకు మీరు స్వయముగా కానీ వకీలు ద్వారా గానీ హాజరు అయి మనవి చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//
కె. ఈశ్వరయ్య, M.Com., B.L.,
టి.వి.రమణ, B.A., B.L.,
పిటిషనర్ తరపున న్యాయవాదులు, రాయచోటి.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : 'చింతల'

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాగిస్తున్న పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నమాజ్‌కట్టవీధి, గంగమ్మగుడివీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి సిఫారసులు లేకుండా అర్హులందరికీ గడప వద్దకే పథకాలు అందిస్తోందన్నారు. మేనిఫెస్టోలోని 98శాతం హామీలను సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే అమలు చేశారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగన్మోహన్ రెడ్డి పాలన సాగుతోందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో పేదలకు ఇన్ని సంక్షేమ పథకాలు అందలేదన్నారు. పేదల కష్టాలను తెలుసుకున్న జగన్మోహన్ రెడ్డి ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఒక లెక్క గెలిచిన తరువాత ఒక లెక్క అనే విధంగా నడుచుకున్నా నాయకులను చూశామని, కానీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఇఒ ఉదయ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి, ఇరిగేషన్ ఎఇ రామచంద్ర, ఎఒ హేమలత, ఎపిఒ ప్రసాద్ బాబు, సచివాలయ ఉద్యోగులు హేమంత రమా, వసంత కుమారి, విజయ కుమారి, కదిరమ్మ, నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, రవినాయక్, వేణు, సుధాకర్, వాలంటీర్లు, పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

పొలంబడి పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు/రూరల్

మండలం అనంతరాజుపేట హార్టికల్చర్ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్సార్ పొలంబడి ద్వారా డివిజన్ లెవెల్‌లో ఏడిఏ, ఎంఈఓ, విఏఎస్, వీహెచ్‌ఐఎస్, విఎస్ఏస్‌లకు ఇచ్చే శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు సోదరులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పొలంబడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజరెడ్డి, స్టేట్ ఎక్జ్యూటివ్ మెంబెర్ ముప్పాళ్ల హేమానవర్మ, జడ్పీటీసీ రత్నమ్మ, మండల వ్యసాయ సలహామండలి చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ బండారు మల్లికార్జున్, మండల కన్వీనర్ సుధాకర్ రాజు, డిఏఓ ఉమామహేశ్వరి, ఏడిఏ కవిత రాజంపేట ఏడిఏ, రమేష్ పాల్గొన్నారు.

కొండయ్యకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-పీలేరు

తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎకనామెట్రిక్స్ విభాగంలో పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించిన విద్యార్థి పాముల కొండయ్యకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షలనియంత్రణాధికారి దామానాయక్ తెలిపారు. సోమవారం ఆర్థికశాస్త్రం విభాగం అధ్యక్షులు డి.కృష్ణమూర్తి మార్గదర్శకత్వంలో యునైటెడ్ కింగ్డమ్ భారతదేశ వాణిజ్యం, ఎంచుకున్న వస్తువుల యొక్క అర్ధమితీయ విశ్లేషణ అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. కొండయ్య పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని అనేక పత్రములు సమర్పించారు. ఢిల్లీకి చెందిన యుజిసి, ఐసి ఎస్ఎస్ఆర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొండయ్య డాక్టరేట్ రావడం పట్ల ఆర్థికశాస్త్రం, అర్ధమితీయ ఆచార్యులు, పరిశోధకులు, కె.వి.పల్లి మండలం, గ్యారంపల్లి కొత్తపల్లిలోని తన కుటుంబ, గ్రామ సభ్యులు అభినందనలు తెలిపారు.

కొండయ్య

ఎస్‌టిఒగా రవికుమార్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ప్రభుత్వ ఉపకజానా(సబ్ ట్రెజరీ) కార్యాలయ ఇన్‌ఛార్జి ఎస్‌టిఒగా రవికుమార్ ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి డిపిఒ కార్యాలయంలో పనిచేస్తూ విధులు నిర్వహిస్తూ ఇన్‌ఛార్జి ఎస్‌టిఒగా తంబళ్లపల్లెకు వచ్చినట్లు తెలిపారు. గతంలో ఇక్కడ ఎస్‌టిఒగా పనిచేసిన బాలమురళి ఓ కేసులో సస్పెండ్ అయ్యారు. ఉప ఖజానా కార్యాలయం ద్వారా మెరుగైన సేవలు సకాలంలో అందజేసేందుకు కృషి చేస్తానన్నారు.

రవికుమార్

ఎపిఎంగా గంగాధర్

ప్రజాశక్తి -తంబళ్లపల్లి

స్థానిక వైయస్సార్ క్రాంతి పతం ఏపీవోగా గంగాధర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇన్‌ఛార్జి(కో-ఆర్డినేటర్)గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు. గతంలో ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన మురళి బదిలీపై బి.కొత్తకోటకు వెళ్లారు. మండలంలో మహిళా సంఘాలను మరలింత బలోపేతం చేసి పాక్షిక అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

గంగాధర్

ప్రచార కార్యదర్శిగా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

ఆంధ్రప్రదేశ్ రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా ప్రచార కార్యదర్శిగా అన్నమయ్య జిల్లా నందులూరు మండలం కుమ్మరపల్లి గ్రామానికి చెందిన గుండు మల్లికార్జున రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గుండు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రెడ్డి జాతి సమస్యల పట్ల అవగాహన పెంచుకొని రెడ్డి జాతి ఐక్యత కోసం అన్ని విధాల చేయూతనిస్తూ వారి సమస్యల కోసం కృషి చేస్తానని అన్నారు. తనకు పదవి రావడానికి కృషిచేసిన అధ్యక్షులు యర్రపరెడ్డి సురేంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మల్లికార్జునరెడ్డి

వైభవంగా శ్రీనేలమల్లేశ్వర స్వామి కుంభాభిషేకం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తవళం గ్రామంలోని శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి జలపూరిత కుంబాభిషేకాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఆలయ తాత్కాలిక కమిటి సభ్యులు గోపాలకృష్ణ తెలిపారు. కుంబాభిషేక ఉత్సవాల్లో ముఖ్యఅతిధులుగా జడ్పిటిసి ప్రమీలమ్మ, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్‌ఐ రమణారెడ్డి పాల్గొన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో స్వామి వారికీ జలపూరిత కుంబాభిషేక మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు శంకర స్వామి శాస్త్రి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సమీపంలోని కుమార నది నుంచి స్వచ్ఛమైన జలాన్ని మేళతాలలు, వాయిద్యాలు, నాణ్యాలు, దేవర ఎద్దులు మధ్య తెచ్చి నేలమల్లేశ్వర స్వామికి అభిషేకించారు. మదనపల్లి ఆర్టీసీ డిపో-2 వారు ఆర్టిసి బస్సులను ఆలయం వద్దకు నడపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుండి అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శంకర, రవి, గంగాధర, నారాయణ కుంభాభిషేకం ఉత్సవాన్ని నిర్వహించారు. పలువురు ప్రముఖులు బాబురెడ్డి, శంకర భాస్కర, ఆర్.జె వెంకటేష్, రామినేని జయరాం నాయుడు, మాజీ చైర్మన్ రామకృష్ణ స్వామిని దర్శించుకున్నారు. పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై సర్వే

ప్రజాశక్తి- కలకడ

కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి సర్వే తప్పనిసరిగా చేయాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కదిరాయ చెరువు పంచాయతీలో నిర్వహించిన 104 వాహన ఉచిత సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించి, గర్భిణులకు కావలసిన పోషకాహార విలువలను వారు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని, కాన్పు సమయంలో సురక్షితమైన ప్రభుత్వ కేంద్రాల్లో కాన్పులు చేసుకోవాలని తెలియజేశారు. చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు గోరంత దగ్గు, పోలియో, క్షయ, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకొని ముందుగానే వ్యాధులు టీకాలు తీసుకోవాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య కార్యకర్తలకు తగిన సూచనలు సలహాలు ఇస్తూ ఎలేసీడీసీ సర్వే గృహాల్లో పురుషలకు మేల్ వాలంటరీ, స్త్రీలకు ఆశా కార్యాకర్తలు పరీక్షించాలని తెలియజేశారు. 104 వాహనం ద్వారా 66 మంది గర్భిణులు, ముగ్గురు బాలింతలు, నలుగురు హైపర్ టెన్షన్-2 డయాబెటిస్, ముగ్గురు కీళ్ల నొప్పులకు సంబంధించి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్న, ఆరోగ్య కార్యకర్త శ్రీలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.లావణ్య, ఆశా కార్యకర్తలు కుమారి, సుజాత 104 డేటా ఎంట్రీ రోజా, పైలట్ రమేష్ పాల్గొన్నారు.

కొత్త మెనూ ప్రకారం గోరుముద్ద అందించాలి :ఎంఇఒ

ప్రజాశక్తి-రామాపురం

కొత్త నిబంధన ప్రకారం పాఠశాలలో జగనన్న గోరుముద్ద మెనూ అమలు చేయాలని మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు తెలిపారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలోఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేస్తూ జగనన్న గోరుముద్దను పాఠశాల విద్యార్థులకు అందించాలని తెలిపారు. కొత్త మెనూ ప్రకారం సోమవారం హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు, కూరగాయల పలావ్, కోడుగుడ్డు కూర, చిక్కి, మంగళవారం చింతపండు లేదా నిమ్మకాయ పులి హోర, పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు, బుధవారం కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కి ఇవ్వాలని పేర్కొన్నారు. గురువారం సాంబార్ బాత్, ఉడికించిన కోడిగుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి ఇవ్వాలన్నారు. శనివారం ఆకుకూర, అన్నం, పప్పుచారు, తీపి పొంగలి ప్రకారం అమలు చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు కొత్త మెనూను తప్పక అమలు చేయాలని ఆదేశించారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కలికిరి

అనాథలకు, అభాగ్యులకు, ఆపన్నులకు కొంతలో కొంతైనా ఊరట కలిగించేలా నిస్వార్థ స్వచ్ఛంద సేవ మానవీయ లక్ష్యమని సాహితీవేత్త గవర్నమెంట్ రిటైర్డ్ ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు రాష్ట్ర తెలుగు భాషా సంఘం పూర్వ సభ్యుడు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ పేర్కొన్నారు. టీఎం వ్యాలీ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణయ్య క్రిస్టఫర్ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమంలో 30 మంది వయోవృద్ధులకు శివాలయం, మసీదు దగ్గర ఉన్న యాచకులకు అబ్దుల్ ఖాదర్ దుప్పట్లు వితరణ చేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట సత్యాపురం రాజువారి పల్లెలోనూ అనాథ పిల్లల చదువులకు గాను ఆర్థిక వనరులు లేని ఆయా మసీదుల మౌలిక వసతుల కల్పనకు గాను రూ.ఐదు వేలు అందజేశారు. సిరి ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన దాతృత్వ కార్యక్రమాలకిది కొనసాగింపని పేర్కొన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం మేనేజర్ భాస్కర్ రెడ్డి సిబ్బంది వృద్ధులు పాల్గొన్నారు. ఆశ్రమం ఫౌండర్ ప్రొఫెసర్ ఆదినారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కడప : పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులో డిసెంబరు 8 నుంచి 11 వరకు నిర్వహించబోయే నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్య దర్శి ఎన్.ఖాదర్ వలి పేర్కొన్నారు. ఈ నెల 20న డిఎస్ఎ స్టేడియంలో ఎంపి కలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో మంచి ప్రతిభ కనబరచిన క్రీడా కారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికల నిర్వహణ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షామీర్ బాషా, కోశాధికారి సూర్యప్ర కాష్, సభ్యులు సునీల్, మబ్బాషా, పుష్పరాజ్, కోచ్‌లు గౌస్‌బాషా, రాజు పాల్గొన్నట్లు తెలిపారు. **రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారు....** రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన వారిలో పురుషుల విభాగంలో మధుసూదన్‌నాయుడు, యోగేశ్వర్, పవన్‌కుమార్, పి.సుశీల్‌కుమార్, సమంత్, వహీద్, నాషీర్, మస్తాన్, గఫూర్, అబ్దుల్ రెహ్మాన్, వెంకటేష్, వెంకట్, నాగేంద్ర, సందీప్, అశోక్, అలీఖాన్, రాజశేఖర్, ఖాజా, సల్మాన్ ఉన్నట్లు తెలిపారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హక్కుల సాధన కోసమే ముస్లిం ఐక్యవేదిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అణగారిన ముస్లిం మైనారిటీల సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు ముస్లిముల ఐక్యవేదిక తోడ్పాటు అందిస్తుందని ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నజీర్ అహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిసెంబరు 4న మదనపల్లెలో నిర్వహించే ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర స్థాయి సమావేశం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం ఐక్య వేదిక సమావేశానికి రాష్ట్ర స్థాయిలోని ముస్లిం మతపెద్దలు విచ్చేసి తమ అమూల్యమైన సూచనలు సలహాలు అందిస్తారని తెలిపారు. ముస్లింలో ఐక్యత లోపం కారణంగా రాజకీయ పార్టీలు తమ స్వార్థానికి వాడుకుంటూన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింలు ఇప్పటికీ దుర్భర జీవనం గడుపుతున్నారని వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులు మారాలంటే ఐక్యతతోనే సాధ్యమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో అవగాహన, ఐక్యత సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు అలావుద్దీన్, అధ్యక్షుడు జాఫర్, అధికార ప్రతినిధి ఖలిల్ సయ్యద్, సంయుక్త కార్యదర్శి సయ్యద్ నూర్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లు అన్వర్, నజీర్ బాషా, జిల్లా మహిళ అధ్యక్షురాలు సయ్యద్ మెహతా రాష్ట్ర సలహాదారు మస్తాన్ వలి, ఫయాజ్, రెడ్డి సాహెబ్ పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండల కేంద్రంలోని కుశావతి నది తీరాన వెలసిన శ్రీ భవాని శంకర్ ఆలయంలో తాటిమకులపల్లి శివాలయం, వెళిగల్లు శివాలయాల్లో కార్తీక సోమవారం నాల్గవ వారం సందర్భంగా పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు, మహా మంగళహారతి, కుంకుమార్చన ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం అర్చకులు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు మణికంఠ స్వామి, ప్రసాద్ స్వామి, భక్తులు, ఇతర గ్రామ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు

జడ్‌పిటిసికి గిరిజనుల వినతి

ప్రజాశక్తి-పీలేరు

తాము నివాసం ఉంటున్న కాలనీ స్థలం తమదని, ఖాళీ చేయాలంటూ తమను ఇబ్బంది పెడుతున్నారంటూ గొడవాండ్లపల్లి గ్రామస్తులు జడ్‌పిటిసి గజ్జల శృతి శీన్ రెడ్డికి సోమవారం మెరబెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే కె.వి.పల్లి మండలం, మోటుపల్లి వాండ్లపల్లి పంచాయతీ, గొడవాండ్లపల్లికి చెందిన పిచ్చిగుంట్ల కులస్థులకు 2006లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాలనీ ఇండ్లు ముంజూరు చేశారు. వారికి కేటాయించి స్థలంలో ఇండ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం కాలనీలోనే నివాసం ఉంటున్న హాస్టల్ వార్డెన్ రాచర్ల వెంకటేశ్వర రావ్, అతని కుమారుడు రెండు నెలలుగా కాలనీ స్థలం తమకు చెందిందని, మీరు ఇండ్లు ఖాళీ చేయాలని బెదరిస్తున్నట్లు కాలనీ వాసులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. స్పందించిన జడ్‌పిటిసి ఈ సమస్యను తాము ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రాంచంద్రా రెడ్డిల దృష్టికి తీసుకు వెళ్ళి తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల యువాధ్యక్షులు గజ్జల శీనురెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎలిశెట్టి వెంకటరమణ, హరిబాబు, బాధితులు పాల్గొన్నారు.

తమ సమస్యను జడ్‌పిటిసి దృష్టికి తీసుకు వెళ్ళిన బాధితులు

క్రైం కార్నర్

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన రామకృష్ణ

రెండు స్కూటర్లు ఢీ : ఒకరు మృతి

ప్రజాశక్తి-రామాపురం

కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోనే మండలంలోని గువ్వలచెరువు హరిజనవాడ వద్ద రెండు స్కూటర్లు ఢీకొన్న సంఘటనలో రామృష్ణ(55) మృతి చెందారు. వెంకట సుబ్బయ్య అనే మరొక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మండలం యనమలోలపల్లె చెందిన రామకృష్ణ, వెంకట సుబ్బయ్యలు పొలతల నుంచి స్కూటర్‌లో వస్తుండగా గువ్వల చెరువు హరిజనవాడ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో స్కూటర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ, వెంకట్ సుబ్బయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108లో కడప రిమ్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ రామకృష్ణ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

టెంపో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. సోమవారం మండలంలోని అడివినయన్ చెరువుపల్లికి చెందిన శివన్న, భార్య అంజనమ్మ కొత్తగా కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనానికి పూజ చేయించేందుకు మల్లయ్య కొండకు బయలుదేరారు. మూడు రోడ్ల కూడలిలో ఎదురుగా వస్తున్న టెంపో ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో శివన్న కుడి కాలు మూడు చోట్ల విరిగింది. భార్య అంజనమ్మకు ఎలాంటి గాయాలు లేవు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోకి తరలించి ప్రధమ చికిత్సలు చేశారు. అదే 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన శివన్న

సత్ప్రవర్తనతో విద్యనభ్యసించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న జడ్జి కవిత

పిల్లలు సత్ప్రవర్తనతో విద్యలభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత సూచించారు. సోమవారం కడప నగరం ఎర్రముక్కపల్లి లో ఉన్న గాంధీనగర్ హైస్కూల్‌లో ఉన్న లీగల్ లిటరసీ క్లబ్‌ను ఆమె సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ డే ప్రాముఖ్యతను తెలియజేశారు. బాలవివాహాలు టోల్ ఫ్రీ నెంబర్ 1098 పై అవగాహన కలిగించారు. విరామ సమయంలో విద్యార్థులు క్లబ్‌లో ఉన్నటువంటి పుస్తకాలను చదివి న్యాయ చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి అన్నారు. అనంతరం ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లెలో ఉన్న పునీత్ సెయింట్ లారెన్స్ వృద్ధాశ్రమానికి వెళ్లి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వంచారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు చెన్నయ్య, పారా లీగల్ వాలంటరీ అరుణకుమారి, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

మృతిచెందిన గొర్రెపిల్లల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపిపి

కుక్కల దాడిలో 50 గొర్రె పిల్లలు మృతి

ప్రజాశక్తి-చెన్నూరు

స్థానిక ఎల్లమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న పొలాలలో సోమవారం సాయంత్రం మండలంలోని ఉప్పరపల్లె గ్రామ వాసులు పంగ ఈశ్వరయ్య, ఎల్లయ్య, ఆదినారాయణకు చెందిన 50 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతిచెందారు. ఎల్లమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న పొలాలలో వారు కంచె ఏర్పాటు చేసి గొర్రె పిల్లలను వదలి పక్క పొలాలలో గొర్రెలను మేపుకొనేందుకు వెళ్లారు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా కుక్కలు గొర్రె పిల్లల మంద పై దాడి చేయడంతో 50 గొర్రె పిల్లలు మృతి చెందాయి. మరికొన్ని గొర్రె పిల్లలు గాయపడడంతో వాటికి గ్రామ సచివాలయ వెటర్నరీ డాక్టర్లు, హరిత, కల్యాణ్ చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ అక్కడి వెళ్లి గొర్రె పిల్లలను పరిశీలించారు .జెడి శారదమ్మకు, వెటర్నరీ డాక్టర్ ఉపేంద్ర ఫోన్లో సమాచారం అందించారు, గొర్రెల పైనే జీవనం సాగిస్తున్న కాపరులకు అధికారులు సాయం చేయాలని సూచించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని గొర్రెల కాపరులు కోరారు.

సొంత నిధులతో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

వనభోజ కార్యక్రమానికి వెళ్లే వారికి ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా తన సొంత నిధులతో పారిశుధ్య పనులు చేపట్టామని మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని చెరువు సమీపాన వెలసిన భైరవ స్వామి ఆలయంలో బలిజ సంఘ నాయకులు కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఆలయానికి వెళ్లే రహదారిని, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వైష్ణవి పాఠశాల యాజమాని యాత్రికులకు వ్యాన్ సౌకర్యం కల్పించి వారిని ఆలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆటల, నృత్య పోటీలు నిర్వహించారు. వేల సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

రైతులే తమ పొలంలో నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం విత్తన ఉత్పత్తిలో రైతులకు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుఊత వ్యవసాయ అనుబంధ రంగాల్లో యువత ఆసక్తి పెరుగుతుందనే ఉద్దేశంతో రైతులకు వివిధ ప్రధాన పంటల్లో విత్తన ఉత్పత్తి పై నైపుణ్య శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సహకారం అందించామని చెప్పారు. అనంతరం వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త చంద్రిక, కెవికె సమన్వయకర్త వీరయ్య మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం రైతులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం విస్తరణ శాస్త్రవేత్త రామలక్ష్మి మాట్లాడుతూ రైతులు వారి అవసరాలకే గాక వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం వితనోత్పత్తికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రవీంద్రనాథరెడ్డి

ఐకమత్యమే యాదవుల బలం

ప్రజాశక్తి-పెండ్లిమర్రి

ఐకమత్యమే యాదవుల బలమని కమలాపురం ఎంఎల్ఎ పి. రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కమలాపురం నియోజకవర్గ యాదవుల ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేయినూతలకోనలో వనభోజనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు నమ్మకస్తులని అందుకే తమ కుటుంబంలో సభ్యులుగా చూస్తామన్నారు. యాదవ్ భవన్, కృష్ణాలయం నిర్మాణానికి తన వంతు సహాయ,సహకారాన్ని అందించడమే గాక ఆర్థిక సాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. జడ్‌పి వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా యాదవులకు పెద్దపీట వేశారన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఒక్క కమలాపురం నియోజకవర్గం నుంచి జడ్‌పి వైస్ చైర్మన్, ముగ్గురు ఎంపీపీ, ఒక వైఎస్ ఎంపీపీ, 16 మంది సర్పంచ్ పదవులను ఇచ్చి యాదవులకు ఆత్మీయుడయ్యారన్నారు. జిల్లా కేంద్రం కడప నగరంలో యాదవ్ భవన్, కృష్ణాలయం, ఇతరత్రా వంటి వాటికి సహకరించిన సీఎం, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన ప్రతి గొర్రెకూ నష్టపరిహారం అందేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు కమలాపురం గండి భారతి, చెన్నూరు ఎంపిపి సురేష్ యాదవ్, ఎంపిపి ఈశ్వరయ్య కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు చెల్లించాలి

కడప అర్బన్ : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఆపస్ జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి , ప్రధాన కార్యదర్శి చెన్నయ్య , రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాదాపు రూ.10 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు వివిధ అనారోగ్య కారణాలతో లక్షలాది రూపాయలు ఆసుపత్రుల్లో ఖర్చుచేసి బిల్లుల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారని, అధికారులు వారి సమస్య గురించి పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. గఫూర్, హాజరైన ప్రతినిధులు

సంక్షోభంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ

- వ్యవసాయ పనులు లేక వలసలు
- ఉపాధి హామీని బలహీన పరుస్తున్న కేంద్రం
- శ్రామికుల జీవన గమనంపై సర్వే
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. గఫూర్

ప్రజాశక్తి- కడప అర్బన్

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి నెట్టవేయబడిందని, వ్యవసాయ పనులు దొరకడం లేదని, ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీన పరుస్తూ ఉందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్ పేర్కొన్నారు. సోమవారం యుటిఎఫ్ భవన్‌లో గ్రామీణ వ్యవసాయేతర కార్మికుల సర్వేపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసేందుకు యంత్రాలకు అనుమతి ఇవ్వడం దారుణమని వాపోయారు. రాయలసీమ జిల్లాలలో పనులు లేక లక్షలాదిమంది శ్రమజీవులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. సిఐటియుగా గ్రామీణ ప్రాంతంలో పేదల జీవితాలు ఎలా ఉన్నాయి, శ్రామికులకు పనులు ఎన్ని రోజులు దొరుకుతున్నాయి, పిల్లల చదువులు, వైద్యం, కుటుంబ ఖర్చులు అప్పులు ఎలా ఉన్నాయి అనే వాటిపై సర్వే చేస్తున్నామని తెలిపారు. ఎనిమిది జిల్లాల వారికి వర్క్ షాప్ నిర్వహించామని చెప్పారు. డిసెంబర్ 20 లోపు ఎంపిక చేసిన జిల్లాలోని మండలాల్లో పది గ్రామాలకు తక్కువ కాకుండా సర్వే చేయనున్నారని పేర్కొన్నారు. రాయలసీమలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంది అనే విషయం తెలుస్తుందని చెప్పారు. సర్వేలోని అంశాలను ప్రభుత్వం ముందు పెడతామని తెలిపారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం క్రీడామైదానాలను, ఇండోర్ స్టేడియాలను , క్రీడా వికాస కేంద్రాలను ప్రయివేట్‌కు లీజుకు ఇచ్చే నిర్ణయం ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ తెలిపారు. సోమవారం శాప్ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్‌ను ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ క్రీడ మైదానాలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియాలను స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంటర్లను, పే అండ్ ప్లే పేరుతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రయివేట్ కాంట్రాక్టర్లకు రీజికిచ్చే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ కడప జిల్లా కమిటీగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని విజయవాడ లోని శాప్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వాన్ని అరెస్టు చేయడాన్ని దారుణమని వాపోయారు. కుందిస్తున్నమని అన్నారు. ఈ విధానం వల్ల క్రీడాకారులపై సభ్యత ఫీజు, నెలనెలా ఫీజు, సామాగ్రి చార్జీల భారం, వసతి భారం పడనుంది. ఇప్పటికే క్రీడాకారులు క్రీడా అభిమానులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లేఖలు సైతం రాశామని పేర్కొన్నారు. శాప్ డైరెక్టర్ మాట్లాడుతూ ఈ విధానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి క్రీడాకారులకు న్యాయం జరిగే విధంగా చూస్తాం అన్నారు .కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్ రాజ్ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు, నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

శాప్ డైరెక్టర్ కు వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఉద్యోగులను అభినందిస్తున్న ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

క్రీడా ప్రతిభ ప్రశంసనీయం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎల్‌ఐసి కడప ఉద్యోగులు ఎం.డి. అష్ఫాఖ్ హుస్సేన్, ఆర్. శ్రీధర్ కీడా ప్రతిభ ప్రశంసనీయమని ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అవధానం శ్రీనివాస్, రఘునాథరెడ్డి అన్నారు. ఈనెల 15 నుంచి 18 వరకు భోపాల్‌లో ఎల్‌ఐసి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడల్లో వాలీబాల్ విభాగంలో కాంస్య పతకం అష్ఫాఖ్, చెస్‌లో స్వర్ణ పతకం శ్రీధర్ సాధించడంతో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అమీనా పర్వీన్, అక్బర్ బాషా, రఘు, లీలా లక్ష్మి, మోసెస్, అయ్యవారు రెడ్డి, నజీర్, కుమార్, శ్రీకృష్ణ, పద్మజ, అహ్మద్ బాషా, వేణు, నరసయ్య, సుబ్బారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

బెస్తలకు చీకటి రోజులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న యాటగిరి రామ్‌ప్రసాద్

టిడిపి హయాంలో బెస్తల అభ్యున్నతి కోసం ఎన్నో రకాల సంక్షేమ పథకాలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగు నింపారని, వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వారికి చీకటి రోజులు తీసుకొచ్చారని టిడిపి బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్ ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని కూడా తూ... తూ...మంత్రంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం దారుణమని వాపోయారు. మూడున్నర ఏళ్ల వైసిపి పాలనలో బెస్తలకు ఏమి చేశారో చెప్పుకోలేని దయనీయ స్థితి ఏర్పడిందని తెలిపారు. అవగాహన రాహిత్యంతో ఆర్భాటంగా హబ్, ఆంధ్ర ఫిష్ అంటూ విఫలమయ్యారని చెప్పారు. చంద్రన్న పాలనలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కృషి తో 50 సంవత్సరాలకే మత్స్య కారులకు ఫించన్ అందించారని చెప్పారు. సమావేశంలో టిడిపి బెస్త సాధికార రాష్ట్ర సభ్యులు మానా చంద్ర శేఖర్, ఆవుల వెంకటేష్, పిల్లి సూరి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఇంటింటికీ యుటిఎఫ్

కడప అర్బన్ : ఇంటింటికి యుటియఫ్‌లో భాగంగా సిపిఎస్ ఉద్యోగులకు సిపిఎస్, జిపిఎస్ పెన్షన్ అమల పరచడం వల్ల కలిగే నష్టాలను తెలియజేయడంతో పాటు పాత పెన్షన్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. సోమవారం వై జంక్షన్ వద్ద టీ హోటల్‌లో ఉన్న సిపిఎస్ ఉద్యోగులను, ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ మహమ్మారి ఉద్యోగ, ఉపాధ్యాయులకు వృద్ధాప్యంలో భరోసా లేకుండా చేస్తుందని పేర్కొన్నారు. ఈ పెన్షన్ రద్దు కోసం పాత పెన్షన్ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి, ఎన్‌జిఒ నాయకులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దేవుని కడప ఆలయంపై పుస్తకం విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరానికి చెందిన ప్రముఖ రచయిత, ఆధ్యాత్మిక వేత్త, రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఐ. ఎల్. ఎన్. చంద్రశేఖరరావు రచించిన తిరుమల తొలిగడప దేవుని కడప పుస్తకాన్ని సోమవారం ఉదయం తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలలో పెద్దశేష వాహన సేవలో వాహనం ముందు వైపు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించారు. వాహన సేవ ప్రారంభంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలమండలి అధ్యక్షులు వై వి సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతా రెడ్డి, కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి, సతీమణి, దేవస్థానం జె ఈ ఒ వీరబ్రహ్మం, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డాక్టర్ ఆకెళ్ళ విభీషణ శర్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సంక్షేమ హాస్టళ్లను విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

సంక్షేమ హాస్టళ్లను వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ విమర్శించారు. సోమవారం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంక్షేమ హాస్టల్ పోరు బాట కార్యక్రమం చేపట్టారు. ప్రకాష్ నగర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ బిసి హాస్టల్‌లోకి వెళ్లి హాస్టల్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన వసతులు విద్యార్థులకు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో మురుగు దొడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. వసతులు సంక్రమంగా లేవని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి కాస్మిటిక్ చార్జీలు ఇవ్వడం లేదు అని విద్యార్థులు వాపోయారని పేర్కొన్నారు. భోజనాలు కూడా నాసిరకంగా ఉందని చెప్పారు. హాస్టల్లో సమస్యలు చాలా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అన్ని వసతులు కల్పించాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో, టి.ఎన్.ఎస్.ఎఫ్. కడప పార్లమెంట్ నాయకులు అఫ్జల్, నగర అధ్యక్షుడు అనిల్, ఇల్లూరు ఓబులేష్, రాయుడు, బిల్లా నవీన్ పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

కడప : ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 25న సాయంత్రం ఐదు గంటలలోపు తెలియజేయాలని, తరువాత వస్తే పరిగణలోకి తీసుకోమని సాంఘీక సంక్షేమ శాఖ అధికారి జయప్రకాష్ తెలిపారు. సంయుక్త సంచాలకుల కార్యాలయంలో, షెడ్యూల్డ్ తెగల వారి జాబితాను బహిరంగంగా ప్రదర్శించినట్లు తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్/ కడప

జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. **కలెక్టర్ కార్యాలయంలో..** స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జెసి సాయికాంత్ వర్మ, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, స్పెషల్ కలెక్టర్ రామ మోహన్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

మట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

ప్రభుత్వ పథకాల అమలులో అనుకున్న లక్ష్య సాధన దిశగా అడుగులేయాలని, ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని కలెక్టర్ వి.విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, డిఆర్ఒ, శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనాతో కలసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతిపై మండల, నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ పూర్తయినవి, పూర్తి కానివీ, గ్రౌండింగ్ ప్రారంభమైనవి, మేస్త్రీలతో మాట్లాడి ఇసుక, ఇనుము, సిమెంట్ వంటి అన్ని రకాల సదుపాయాలను సమకూర్చాలని చెప్పారు. నిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రారంభంకాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి బిబిఎల్ స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని పేర్కొన్నారు. గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో రోజూ సమీక్ష చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ పై క్షేత్ర స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని నివేదికను పంపాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు, హౌసింగ్ , అనుబంధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

అందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ం నగరంలోని 13 వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ ఎం. రామ లక్ష్మణ్ రెడ్డి ఆధ్వర్యంలో అరవింద నగర్ సచివాలయం-1 పరిధిలోని బాపూజీ రోడ్డు, నేతాజీ రోడ్డు, రామాలయం రోడ్డు లలోని పలు ప్రాంతాల్లో పర్యటన సాగించారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి. ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో నేరుగా మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసమే ముస్లిం ఐక్యవేదిక

ప్రజాశక్తి - కడప అర్బన్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐక్యవేదిక నాయకులు

ముస్లిముల హక్కులు, అభివృద్ధి కోసమే ముస్లిం ఐక్యవేదిక ఏర్పడిందని ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ సల్లావుద్దీన్ తెలిపారు. సోమవారం మదనపల్లి ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. రాష్ట్రస్థాయి సమావేశం పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిముకు అవగాహన కల్పించడం కోసం ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సభలు నెల్లూరు నుంచి ప్రారంభమై మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, కడప, అనంతపురం మీదుగా మదనపల్లి చేరుకుందన్నారు. ముస్లిం సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 4న మదనపల్లిలో రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి ముస్లిమ్ మత పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

గ్రామీణుల ఇళ్లవద్దకే వైద్యం

ప్రజాశక్తి-కాశినాయన

యూనిఫామ్ అందజేస్తున్న వైద్యురాలు ప్రశాంతి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఇళ్లవద్దకే వైద్యం అందిస్తామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన నరసాపురం మిద్దెల మూలపల్లె, నరసన్నపల్లె గ్రామాలలో వైద్య సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి పేదలకు వైద్యం చేశారు. నరసాపురంలోని కామెని వెంకటరెడ్డి కొనేళ్లుగా అనారోగ్యంతో ఇంటి వద్దే ఉండడంతో ఆయన వద్దకు వెళ్లి వారు వైద్యయం చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేశారు. గ్రామాలలో ఆశ కార్యకర్తలు చాలా కీలకంగా వ్యవహరించాలని, ప్రతి సమచారాన్నీ ఎప్పటికప్పుడు ఆరోగ్య కేంద్రానికి చేరవేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల ఆశానోడల్ అధికారి శారద,. ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసరెడ్డి, సుబ్బరాయుడు, ఆరోగ్య పరిరక్షకురాలు నాగమణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్‌వి'లో ప్రపంచ టెలివిజన్ డే

ప్రజాశక్తి-కడప సిటీ

సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపల్ వీరసుదర్శనరెడ్డి

స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో వరల్డ్ టెలివిజన్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, సెమినార్ వంటి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వీర సుదర్శన రెడ్డి మాట్లాడుతూ టెలివిజన్ పరిశ్రమలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు అవకాశాలు వచ్చాయని చెప్పారు. ముమ్ముందు టెలివిజన్ పరిశ్రమంలో ఇంకా కొత్త ఆవిష్కరలు చేసేందుకు అవకాశాలు చాలా ఉన్నాయని చెప్పారు. వీటిని ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అనంతరం పోటీలలో పాల్గొన్న విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సిఎస్ఎం విభాగాధిపతి పి.ఎ. రమేష్, ఇసిఇ విభాగ అధిపతి బి. ప్రవీణ్ కుమార్, సిఎస్‌సి విభాగధిపతి జి. శ్రీనివాసులు, ఎస్. ఇలియాస్ అలీ, అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

చొప్పా గంగిరెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె



అవార్డు అందుకుంటున్న చొప్పా గంగిరెడ్డి

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల అధినేత చొప్పా గంగిరెడ్డికి విద్యారంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా మలేషియా దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన సెయింట్ మదర్ థెరిస్సా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పి అత్యుత్తమ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తూ, అనేక మంది విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించామని చెప్పారు. అందువల్ల ఈ గౌరవ డాక్టర్ అందజేశారని ఆయన పేర్కొన్నారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు హర్ష వ్యక్తం చేశారు.

వైసిపి దెబ్బకు తరలి పోతున్న పరిశ్రమలు : పిసిసి

ప్రజాశక్తి -వేంపల్లె

వైసిపి నాయకులు దెబ్బకు రాష్ట్రంలోని పరిశ్రమలు అబ్బా అంటూ తరలిపోతున్నాయని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలన్నీ ఇతర రాష్ట్రాలకు తరలి పోవడంతో పాటు కొత్తవీ రావడం లేదని చెప్పారు. విస్తరణ పనులు ఆగి పోతున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం ప్రత్యేక హోదా కూడా సాధించలేకపోయిందని వాపోయారు. విభజన చట్టంలో పేర్కొన్న కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్లు, దుగరాజపట్నం ఓడరేవు, విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ సాధించలేదని విమర్శించారు. రిలయన్స్ కంపెనీ రాష్ట్రం నుంచి పారిపోయిందని చెప్పారు. టైటాన్ జంప్ కావడంతో పాటు కియా కంపెనీ విస్తరణ ఆగిపోయిందని తెలిపారు. వైసిపిని ప్రజలు రాష్ట్రం నుంచి తరిమేస్తేనే రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం

లింగాల : లింగాల మండలంలోని గుణకనపల్లి గ్రామంలో ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రాఘవేంద్రమ్మను సోమవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఆల్ ది బెస్ట్ ఆర్ట్ అకాడమీ సాహిత్య సంస్కృతిక సామాజిక సేవా సంస్థ సుందరయ్య కళాక్షేత్రంలో విశిష్ట ప్రతిభ పురస్కారాలతో సత్కరించారు. విద్యారంగంలో సేవలు అందించిన రాఘవేంద్రమ్మను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా హక్కుల కమిషనర్ చైర్మన్ జస్టిస్ జి ఆర్ చంద్రయ్య, తెలంగాణ హైకోర్టు జస్టిస్ ఎస్ నంద చేతుల మీదుగా సన్మానించారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

వేంపల్లె : స్థానిక సంఘం వీధిలో ఉన్న గౌరిదేవి ఆలయం వద్ద బలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా గౌరిదేవి ఆలయం వద్ద సిద్దారెడ్డి, అంజనమ్మ, ఆరుశేర్ల రాయుడు, శేఖర్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమాన్ని బలిజసంఘం అధ్యక్షులు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్ ప్రారభించారు. ప్రతి ఏడాదీ కార్తీక మాసంలో గవి మలేశ్వర ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించేవారని అన్నదాన కార్యనిర్వహకుడు తెలిపారు. గవి మలేశ్వర ఆలయం వద్ద పనులను జరుగుతుండడంతో గౌరిదేవి ఆలయంలో అన్నదానం చేపట్టినట్లు చెప్పారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, డాక్టర్ రంగయ్య, ఎంపిటిసి రాజ్ కుమార్, వార్డు సభ్యులు ఆంజనేయులు, గాలి హరిప్రసాద్, నామా చంద్రశేఖర్, రమేష్ బాబు, శ్రీకృష్ణ ఆలయ కమిటీ ప్రతినిధి డేరంగుల రామాంజనేయులు, హకీం, బాలం జయచంద్ర, బాలం మనోహర్, బాలం గోపాల్ పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న ఎంఎల్ఎ రఘురామిరెడ్డి

అన్నదానం గొప్పది : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మైదుకూరు

అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని స్థానిక ఎంఎల్ఎ ఎస్. రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తెలుగు గంగ కాలనీలో వడ్డెర కులస్తుల వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలు చేయాలన్నారు. అనంతరం ఆయన వనభోజనానికి వచ్చిన వడ్డెర కులస్తులకు స్వచంగా అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర. చాపాడు ఎంపీపీ లక్ష్మయ్య, కె.సి. లింగన్న, . వీరనారాయణరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

వనభోజనంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం

కడప : నగరంలోని రామచంద్రపురంలో వైసిపి జిల్లా బిసి విభాగ అధ్యక్షులు బంగారు నాగయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్తీకమాస వనభోజ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్ భాషా, వైసీపీ జిల్లా అధ్యక్షులు, కడప నగర మేయర్ సురేష్ బాబు పాల్గొన్నారు. వచ్చినవారికి స్వయంగా వారు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి మా సీమ బాబు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర జిల్లా నగర నాయకులు, మహిళ నాయకులు, జిల్లా,నగర అనుబంధ విభాగ అధ్యక్షులు -కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని త్వరగా నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - కడప

కలెక్టర్‌కు విన్నవిస్తున్న నజీర్ అహ్మద్

బుగ్గ వంక బ్రిడ్జిని త్వరగా నిర్మించాలని సోమవారం స్పందన కలెక్టర్ విజయ్ రామరాజుకు కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు షేక్ నజీర్ అహ్మద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని షామిరియా మసీదు, లా కళాశాల రోడ్డు వద్ద ఉన్న బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. ఈ విషయంపై పలుదపాలుగా తమకు వినతి పత్రాలు అందజేశామని చెప్పారు. త్వరలో బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతామని కలెక్టర్ ఆయనకు హామీ ఇచ్చారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

జమ్మలమడుగు రూరల్ : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గూడెంచెరువు సచివాలయ పరిధి లోని అంజనాపురం, అనంతగిరి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటిఇంటికి తిరిగి ప్రజలతో జగనన్న ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన బుక్ లెట్ అందజేశారు. ప్రతి ఇంటికీ అ అందవల్సిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరాతీశారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జారి నాగేశ్వరి, నాయకులు రమణ, నాగేశ్వర రెడ్డి, సంజీవ్, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కడప : పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులో డిసెంబరు 8 నుంచి 11 వరకు నిర్వహించబోయే నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.ఖాదర్ వలి పేర్కొన్నారు. ఈ నెల 20న డిఎస్ఎ స్టేడియంలో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో మంచి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.ఎంపికల నిర్వహణ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షామీర్ బాషా, కోశాధికారి సూర్యప్రకాష్, సభ్యులు సునీల్, మబ్బాషా, పుష్పరాజ్, కోచ్‌లు గౌస్‌బాషా, రాజు పాల్గొన్నట్లు తెలిపారు. **రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారు....** రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన వారిలో పురుషుల విభాగంలో మధుసూదన్‌నాయుడు, యోగేశ్వర్, పవన్‌కుమార్, పి.సుశీల్‌కుమార్, సమంత్, వహీద్, నాషేర్, మస్తాన్, గఫూర్, అబ్దుల్ రెహ్మాన్, వెంకటేష్, వెంకట్, నాగేంద్ర, సందీప్, అశోక్, అలీఖాన్, రాజశేఖర్, ఖాజా, సల్మాన్ ఉన్నట్లు తెలిపారు. ఉమెన్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో రుతిక రేణు, సరిత, కృష్ణవేణి, కుసుమప్రియ, శ్రీలక్ష్మి, పావని, గాయత్రి, రిచిత, తేజ, దీప్తి, హేమశ్రీ, శివ మల్లేశ్వరి, నోమిత, విజయలక్ష్మి అమృత, ఈస్విత ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించాలి

రైల్వేకోడూరు రూరల్: మండలంలోని సమతా నగర్‌లో విద్యుత్ స్తంభాలు పునరు ద్ధరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సి. హెచ్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన సమతానగర్‌లో పర్యటించి మాట్లాడుతూ స్తంభాలు కూలిపోవడం, ఒరిగిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పూర్తిగా ఉందన్నారు. విద్యుత్ స్తంభం ఒరిగిపోయి, వర్షాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఏం జరిగినా విద్యుత్ అధికారులు బాధ్యతన్నారు.

నిరుపయోగంగా పాల సేకరణ భవనాలు

నాగులపల్లిలో నిరుపయోగంగా ఉన్న పాల సేకరణ కేంద్రం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. శిథిలావస్థలకు చేరుకున్నాయి. 30ఏళ్ల క్రితం సిద్ధారెడ్డిపల్లి, నాగులపల్లె, విశ్వనాథపురం, ఓబుల్‌రెడ్డి పేట, చిన్న గురవలూరు, అనంతపురం, చియ్యపాడు, అన్నవరం గ్రామాల్లో సహకార సంఘాలు ఏర్పాటు చేసి దాతలు నుంచి స్థలాలను సేకరించి పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సేకరించిన పాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచిన ప్రొద్దుటూరు, మైదుకూరు పాల కేంద్రాలకు పాలను తరలించేవారు. కాలక్రమేణా ప్రభుత్వ పాల కేంద్రాలు మూతపడడం.. ప్రయివేట్ కేంద్రాలు రావడంతో గ్రామాల్లో కూడా సేకరణ కేంద్రాలు మరుగున పడ్డాయి. వాటి భవనాలు చాలా వరకు దెబ్బతిన్నాయి. సిద్ధారెడ్డిపల్లిలో ఉన్న భవనానికి మూడేళ్ల క్రితం మరమ్మతులు చేసి, మంచినీటి శుద్ధి పథకానికి వినియోగించారు. తర్వాత అది మూతపడడంతో ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఓబుల్‌రెడ్డిపేటలో భవనాన్ని ప్రస్తుతం ప్రయివేటు వ్యక్తులు పాల సేకరణకు వినియోగిస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో భవనాలు దాదాపు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల కోసం, అమూల్ పాల సేకరణ కేంద్రాలకు వీటికి మరమ్మతులు చేసి వినియోగిస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. విశ్వనాథపురం గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే పాల సేకరణ భవనం ఉంది. పూర్తిగా దెబ్బతిన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వానికి అవసరమైన కార్యాలయాలకు ఇతర ప్రభుత్వ భవనాలకు ఉపయోగంలోకి తీసుకురావాల్సి ఉంది. దెబ్బతిన్న పాల సేకరణ కేంద్రాలను ప్రజా ఉపయోగాలకు మార్చితే ఉపయోగకరంగా ఉంటుంది.

అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్ల నిధులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కాల్వ నిర్మానానికి భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ సుధీర్‌రెడ్డి

గొరిగెనూరు గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎంఎల్ఎ డాక్టర్ మూలే సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గొరిగెనూరు గ్రామంలో మురుగునీరు కాల్వల నిర్మాణానికి సర్పంచ్ మత్తయ్య, ఎంపిటిసి భాస్కర్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల నుంచి గొరిగెనూరులోని ఎస్‌సి, బిసి, రజ కుల కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 2019 కంటే ముందు ఎంపీ అవినాష్‌రెడ్డితో కలసి ఇక్కడికి వచ్చానని చెప్పారు. ప్రస్తుతం ఇప్పటికే రూ.70 లక్షలతో బిసి కాలనీలో రోడ్డు వేశామన్నారు. డ్రెయినేజీ వ్యవస్థతో ఎస్‌సి కాలనీ రూపురేఖలు మారుతాయని చెప్పారు. పైపు లైన్‌కు, నీళ్ల ట్యాంకుకు టెండర్ పూర్తయ్యాయన్నారు. ఇక్కడ అభివృద్ధి ముందడుగులో ఉందన్నారు. చంద్రబాబుకు మతి భ్రమించిందన్నారు. చివరి ఎన్నికలని చెప్పుకుంటున్నా చంద్రబాబును 2019లోనే ప్రజలు పక్కన పెట్టారన్నారు. తమపై బురద చల్లడం తప్ప దేవగుడి కుటుంబానికి ఏ పని లేదని పరోక్షంగా విమర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి హరిత, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొచ్చిరెడ్డి వెంకట రమణా రెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి మల్లిరెడ్డి హనుమంతరెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, వైసిపి నాయకులు బోనం సురేష్, అధికారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నియంత్రించాలి

బాలికలనుద్దేశించి మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా

ప్రజాశక్తి - వేంపల్లె

బాల్య వివాహలకు విద్యార్థులు దూరంగా ఉంటూ నియంత్రించాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా కోరారు. సోమవారం స్థానిక ఉర్దూ ఎపి రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వివాహపు వయస్సును తెలుసుకోవాలని సూచించారు. కొందరు తల్లిదండ్రులు కుటుంబ ఇబ్బందుల వల్ల బాల్యవివాహాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తారని అలాంటి వాటిని ప్రతి విద్యార్థి తిప్పి కొట్టాలని చెప్పారు. బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తాయని చెప్పారు. ఆడపిల్లలు 18 సంవత్సరాల వయస్సు పైబడిన తర్వాతనే వివాహాలు చేసుకోవాలని కోరారు. బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో కుష్ఠు వ్యాధిపై సర్వే చేస్తున్నట్లు చెప్పారు. కుష్ఠు వ్యాధి మైక్రో , లెప్రే అను బ్యాక్టీరియా వల్ల వస్తుందని చెప్పారు. వ్యాధి బయట పడడానికి 5నుండి 7 సంవత్సరాలు పడుతుందని చెప్పారు. కుష్ఠు వ్యాధి సోకితే శరీరంపై స్పర్శ లేని మచ్చలు లావుగా మారడంతో పాటు నరాలు నొప్పిగా ఉండడం, పాదాలు, చేతులు, నరాలలో తిమ్మిర్లు ఉంటాయని చెప్పారు. వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకొని మందులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటరత్నం, ప్రిన్సిపల్ శివప్రసాద్ రెడ్డి, ఎటిపి హబీబుల్లా సాఫ్ట్ నర్స్ అరుణ ఉపాధ్యాయులు నూర్జహాన్, పిఇటి హేమమాలిని, ఎఎన్ఎం నాగశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సైకో ప్రభుత్వాన్ని సాగనంపండి : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సైకో ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బాయ్..బాయ్ చెప్పి సాగనంపాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దానవలపాడు పంచాయతీ శేషారెడ్డి పల్లె గ్రామంలో బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఎన్నిక సమయంలో వైసిపి శనగ క్వింటాకు రూ. 6 వేల మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి పూర్తిగా విఫలమైందన్నారు. ఈ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పుతామని శంకుస్థాపన చేసి 36 నెలలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీని నెరవేర్చ డానికి పది శాతం కూడా ప్రయత్నం చేయకపోవడం దారుణమని వాపో యారు. అభివృద్ధిపై సూచనలు ఇస్తున్న ప్రతిపక్ష నాయకులపై ప్రతిదాడులు చేస్తూ అక్రమ కేసులను బనాయిస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేయడంలోనే రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైందన్నారు. ఇటువంటి సైకో ప్రభుత్వం పోయి సైకిల్ ప్రభుత్వం రావాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి వేయించి గెలిపించాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, కిరణ్ రాయల్, చిన్న గురువి రెడ్డి, గురు శేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, వెంకటరెడ్డి, పుల్లారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, ముని రెడ్డి, పెద్ద ఓబుల్ రెడ్డి, గురుశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సరస్వతి, సురేష్, అనిల్, స్వరూప్, సత్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

ఆర్‌టిపిపిలో భూనిర్వాసితుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపి స్టేజ్ -4 గేటు వద్ద సోమవారం భూ నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు సంయుక్తంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దీక్షలను అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించి దీక్షలు చేపట్టారు. ఆర్‌టిపిపి యాజమాన్యం పోలీసులచే దీక్షలను అడ్డుకోవడం దుర్మార్గమని సిఐటియు కార్యవర్గ సభ్యులు కొండారెడ్డి, వెంకటస్వామి మండిపడ్డారు. దీక్షలకు సిపిఎం, సిఐటియుతోపాటు ఎఐటియుసి నాయకులు చాంద్‌బాషా, టిఎన్‌టియుసి నాయకులు వీరారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సున్నపురాళ్లపల్లె సర్పంచ్ మునినాధరెడ్డి, కలమ్మల వైసిపి నాయకులు నారపరెడ్డి, సూర్యుడు దీక్షలకు సంఘీభావం తెలియజేశారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెల్పుతున్న నిర్వాసితులు, కార్మికులు

నూర్పిళ్లు ప్రారంభం.. వరి గడ్డికి డిమాండ్

ప్రజాశక్తి - చాపాడు

వరిగడ్డిని పొలంలోనే ట్రాక్టర్‌తో తీసుకెళుతున్న పాడిరైతులు

అధిక వర్షాల తాకిడికి గత ఖరీఫ్‌లో వరి రైతు కుదేలైన విషయం తెలిసిందే. ఈ ప్రభావం ఈ ఏడాది పాడి రైతులపై అధికంగా కనిపిస్తున్నది. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట నూర్పిడిని రైతులు చేపడుతున్నారు. వరి గడ్డి సేకరణకు పాడి రైతులు చర్యలు చేపడుతున్నారు. గత ఏడాదిలో వరి పంట అధికంగా నేల కొరగడం, వరిగడ్డి దెబ్బతినడం జరిగింది. నేలకొరిగిన వరి పంటను చైన్‌లతో నడిచే వరి కోత మిషన్ల ద్వారా పంట నూర్పిడి చేపట్టారు. ఈ మిషన్ల ద్వారా నూర్పిడి చేయడం వలన వరి గడ్డి ఏమాత్రం పనిక రాకుండా పోయింది. టైర్ల మిషన్ల ద్వారా, కూలీల ద్వారా నూర్పిడి చేసిన వరిపంట నుండి మాత్రమే వరిగడ్డి లభ్యమైంది. గత ఖరీఫ్‌లో మండల పరిధిలో 16 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 10 వేల ఎకరాలు తుఫాన్ తాకిడికి నేలకొరిగింది. ప్రస్తుతం మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు, బి.మఠం మండలాల్లో 45వేల ఎకరాల్లో వరి పంటను సాగుచేపట్టారు. పెన్నా, కుందు తీర ప్రాంతంలో ముందస్తుగా సాగు చేసిన 6వేల ఎకరాలలో వరి పంటను నూర్పిడి చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వరిగడ్డి సేకరణలో పాడి రైతులు నిమగ్నమయ్యారు. ఎకరా వరిగడ్డి రూ.5 వేల నుంచి రూ.6వేల వరకు ధర పలుకుతోంది. మిషన్ల ద్వారా నూర్పిడి చేసిన వరిగడ్డిని ట్రాక్టర్‌తో కట్టలు కట్టిస్తున్నారు. ఒక కట్ట వరిగడ్డి కట్టడానికి రూ.30 వసూలు చేస్తున్నారు. కట్ట రూ.120తో అమ్మకాలు చేపడుతున్నారు. అయితే ఈ విధానం ద్వారా వరిగడ్డిని సులభంగా కట్టలుగా మార్చి రవాణా సులభతరం అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. వరిగడ్డిని కట్టలు కట్టించేందుకు రవాణాతో కలిపి రూ.9 వేలకు పైగా అవుతోందని పాడి రైతులు వాపోతున్నారు. వివిధ మండలాల నుంచి రైతులు చాపాడు ప్రాంతంలో వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం : ఎంపీ

ప్రజాశక్తి - చక్రాయపేట

వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి చెప్పారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చక్రాయపేట మండలంలోని మాలపల్లె, కుప్పగుట్టపల్లి, మహబూబ్ నగర్ గ్రామాల్లో అధికారులు, నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. అయా ప్రజలు ఇచ్చిన వినతిపత్రాలను స్వీకరించి సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. సంక్షేమ పథకాలు అందలేదని పిర్యాదు రాకూడదని చెప్పారు. చిన్న చిన్న సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలను పంపాలని ఆదేశించారు. రైతులకు ఆయా పథకాల ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాకే డబ్బులు జమ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రాజా సింహ నరేంద్ర, ఎంపిపి మాధవి బాల కృష్ణ, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి బెల్లం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, వైసిపినాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీని అభివృద్ధి చేస్తాం

- చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ

జమ్మలమడుగు : జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలోని సభాభవనంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డులను అభివృద్ధి పథంలో నడిపేందుకు కౌన్సిలర్లందరూ సహకరించాలని కోరారు. పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రెనేజీలు, పైప్ లైన్ కనెక్షన్లకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. నగర పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు మౌలిక వసతుల కల్పన కోసం పాటుపడుతున్నామని చెప్పారు. . ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఎల్ఎ డాక్టర్ సుధీర్‌రెడ్డి, సహకారంతో మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ప్రథమంగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అజెండాలోని అంశాలన్నింటినీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 'పుట్టా' జన్మదిన వేడుకలు

మైదుకూరు : టిటిడి మాజీ చైర్మన్, మైదుకూరు నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ 59వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. .అనంతరం అన్నవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పుట్టా అంటే 'పచ్చజెండా' అని అన్నారు. కార్యక్రమంలో మైదుకూరు పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు. అన్నవరం సుధాకర్ రెడ్డి, మిల్లు శ్రీను టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

-నందిమండలం విజయ సుశీల్ కుమార్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న సుశీల్‌కుమార్

దేశం అభివృద్ధి చెందాలన్నా యువత పాత్ర ఎంతో కీలకమని, రాష్ట్రంలోనూ, దేశంలోనూ యూత్ కాంగ్రెస్‌ను మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం మనందరిపై ఉందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న నందిమండలం విజయ సుశీల్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం విజయ సుశీల్ కుమార్ ప్రజాశక్తితో మాట్లాడారు. 2024లో రాష్ట్రంలోనూ దేశంలోనూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని వచ్చే బాధ్యత ముఖ్యంగా యువతపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు అన్ని రకాలుగా మేలు జరుగుతుందని అన్నారు. 2024లో జరగబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. కడప జిల్లా నుండి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా తాను పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తనను ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అందరూ ఆశీర్వదించి, తమ వంతు సహాయ సహకారాలు అందించడంతోపాటు తమ విలువైన ఓటును ఆన్ లైన్ ద్వారా తనకు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

అంధుల ఆశ్రమానికి బియ్యం వితరణ

పులివెందుల రూరల్ : స్థానిక శ్రీ వీర నారాయణ స్వామి అంధుల ఆశ్రమానికి సోమవారం చిలుకూరి సుంకన్న 14వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు చిలుకూరి సురేష్ ఆశ్రమానికి బియ్యం ప్యాకెట్‌ను అందజేశారు. సందర్భంగా అశ్రమ నిర్వాహకుడు మాట్లాడుతూ ఆశ్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి దాతలు ఏదోక సాయం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఆశ్రమానికి తోడుగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి- చాపాడు

మధ్యాహ్న భోజన పథకాన్ని మోర్రాయపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మండల విద్యాశాఖ అధికారి రవిశంకర్ పరిశీలించారు. మధ్యాహ్నం భోజన పథకంలో ప్రభుత్వం మెనూలో మార్పులు తీసుకొచ్చిందని ఎంఇఒ పేర్కొన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజూ ఉపాధ్యాయులు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేవించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, పీరాన్ సాహెబ్, రాజారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ సుదర్శన్ రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహమ్మద్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

ప్రజాశక్తి- చాపాడు

కార్తీక మాసం 4వ సోమవారం సందర్భంగా మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో గ్రామోత్సవం కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయ ఆవరణలో కోలాటం, ఒంటెద్దు బండి పోటీలు పలువురిని అలరించాయి. నిత్య అన్నదాన, సర్వజన, ఆర్యవైశ్య సత్రాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి ,శ్రీనివాసులు, సర్పంచ్ కిషోర్ కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు సిబ్బంది కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

ఐదుగురు రైతులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని తాళ్లపల్లె గ్రామ సమీపంలో వరి గడ్డి ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడ డంతో ఐదుగురు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. సోమవారం వేముల మండలంలోని తుమ్మ లపల్లె గ్రామానికిచెందిన రైతులు వేంపల్లె నుంచి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో గడ్డిని తీసుకుని తుమ్మలపల్లెకు బయలుదేరారు. మార్గ మధ్యలో తాళ్లపల్లె గ్రామ సమీపంలోకి రాగానే వెనుక వైపు నుంచి లారీ ఢీకొనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న శివ కుమార్, నారాయణ, రవి, పుల్లయ్య, సల్మాన్ అనే రైతులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఇద్దరిని పులివెందుల ఆసుపత్రికి, మరో ముగ్గురిని కడప రిమ్స్ కు తరలించారు.

శ్రీ ఈశ్వరస్వామి దేవాలయము
బెస్తవేముల (గ్రా), మైలవరం(మం), కడప జిల్లా.
e-Procurement Tender
NIT NO.COE/766/2022-3 Dt:18-08-2022
దేవాలయ పున:నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : ధర్మకర్త